**శ్రీ రమణ జ్యోతి** **Sri Ramana Jyothi**
జనవరి 2023 January 2023

ఈ సంచికలో ... IN THIS ISSUE ...

*Sri Ramana Jyothi wishes its readers a very happy, prosperous and joyful New Year 2023*


| | | | |
|---|---|---|---|
| **1.** | **డా॥ కే.యస్. గారి 102వ ప్రవచనం** | డా॥ వి. రామదాస్ మూర్తి | 3 |
| **2.** | **శ్రీదేవీ కాలోత్తర జ్ఞానాచార విభాగము** | తాడిమేటి సత్యనారాయణ | 10 |
| **3.** | **శ్రీ భగవాన్ రమణమహర్షి స్మృతులు (శ్రీ దేవరాజ ముదలియార్)** | జి. శ్రీహరిరావు | 20 |
| **4.** | **కుండలిని మేల్కొనుట** | దోనెపూడి వెంకయ్య | 23 |
| **5.** | **శ్రీరమణ హృదయ గీతిక** | యనమండ్ర సంధ్యాదేవి | 25 |
| **6.** | **శ్రీ భగవాన్ రమణ మహర్షి భక్తాగ్రేసరులు** | మల్లాది ఫణిమాల | 26 |
| 7. | Grace is Always Flowing | Dr K Subrahmanian | 30 |
| 8. | Ashtavakra Gita - 8 | V Krithivasan | 44 |
| 9. | Humility | | 47 |


## Events in Sri Ramana Kendram in January 2023

1. Satsang - Every Sunday - 9.00 - 10.45 a.m.
2. 7th - Sri Bhagavan's 143rd Jayanthi. The Jayanthi will be celebrated on 8th January from 9.00 a.m. - 12 Noon.
3. 11th - Dr. K.S. Remembrance day - 6.00 - 7.30 p.m.
4. 3rd Sunday - Meditation - 9.00 - 10.45 a.m.

© Copyrights of all the material used from Sri Ramanasramam publications in Sri Ramana Jyothi either in excerpted form, translated form or serialised form totally belong to Sri Ramanasramam, Tiruvannamalai.

**శ్రీ రమణజ్యోతి వ్యవస్థాపకులు: కీ॥శే॥ డా॥ కె. సుబ్రహ్మణియన్**
**(వ్యవస్థాపక అధ్యక్షులు, శ్రీరమణకేంద్రం)**

# అహంకారం అశాంతికి కారణం

డా॥ కే.యస్. గారి 102వ ప్రవచనం

అనువాదం: డా. వి. రామదాస్ మూర్తి

మనమందరం సంతోషంగా వుండాలని కోరుకుంటాం. దానికై ఒక్కొక్కరు ఒక్కో మర్గం ఎంచుకుంటాం. అధికంగా ధనాన్ని సంపాదించుకుంటే ఆనందంగా వుంటామని కొందరు అనుకుంటే, మరికొందరు విజ్ఞానంతో అలా వుండవచ్చుననుకొంటారు. ప్రఖ్యాతులైతే గొప్పదనం, సంతోషం వస్తుందని కొందరు, కుటుంబం వల్ల ఆనందం పొందవచ్చునని మరికొందరు భావిస్తారు. వీటన్నిటి కోసం నిత్యం ఏవేవో ప్రయత్నాలు చేస్తుంటారు. ఈ ప్రయత్నాలలో మునిగితేలుతూ కుటుంబానికి తగినంత సమయాన్ని కేటాయించలేకపోతారు. ఇలా క్రమంగా జరిగితే, భార్య, పిల్లలు ఈ విషయమై ఫిర్యాదులు చేస్తారు. తాను కూడ స్వయంగా ధన సంపాదన కోసం పేరు కోసం మొత్తం కుటుంబాన్ని అశ్రద్ధ చేశానని సంతాపం చెందడం జరుగుతుంది. కుటుంబ సభ్యులు విసుక్కుంటారు, మీకు కూడ ఇంత శ్రమ పడినప్పటికి ఫలితం దక్కలేదనిపిస్తుంది.

## అధికారం, సంతుష్టి

మనం మరొక వ్యక్తికి ధనం ద్వారా ఆనందాన్ని కలిగించలేము. అలాగే, మన పేరు ప్రఖ్యాతులు, హోదా, అధికారంతో కూడ అది సాధ్యపడదు. అధికారంగా అతి ఉన్నత స్థితిలో వున్న వారైనా సరే ఏదో కారణంగా సంతుష్టిని పొందలేరు. అలా వారు కూడ ఒక్కొక్క

సారి ఏ సాధువు దగ్గరికో, ఏమీ లేని వారి దగ్గరికో వెళ్తారు. కాని అలాంటి వారు కూడ సమస్యలతో బాధ పడుతుండడం జరుగుతుంది. మరొక విషయం ఏమంటే కొన్ని సందర్భాలలో, సమాజంలో పై స్థాయిలో నున్నవారు, ఆ సంగతి ఇతరులకు తెలియ పరచాలని భావిస్తారు. దాంతో అహం బలపడుతుంది. అంతే కాని అనుకున్నట్లు సంతోషంగా వుండలేము. కొన్ని సమయాల్లో దేవుడు గుర్తుకు వస్తాడు. పూజ, జపాదులను చేసుకుని, తద్వారా, తాము, కుటుంబమూ సుఖంగా వుంటామని అనుకుంటారు. కాని ఆ విషయంలో మనం సంప్రదించే వారు కూడ ఏదో విధంగా బాధపడుతుంటారు. అలాగ ఎందుకు జరుగుతుందని ఆశ్చర్యపడతాము.

అప్పుడప్పుడు మనం రోడ్డు ప్రక్కన మాయలు చేసే మ్యాజిక్ మంత్రగాళ్ళను చూస్తుంటాము. శూన్యం నుండి వస్తువులను తీసి చూపిస్తుంటాడు. ఒక బుట్ట మీద గుడ్డ కప్పి, ఏదో మంత్రాల వంటివి గొణిగి, బుట్ట తెరిచి అందులో నుంచి మామిడి మొక్కను తీసి చూపిస్తాడు. మనం ఆశ్చర్యపోయేలాగ అలాంటివి ఎన్నో చేస్తాడు. మనం ఆశ్చర్యపోతాము గాని, దాని గురించి పెద్దగా ఆలోచించం. చివరకు ఏదైన డబ్బు ఇమ్మని అందరినీ అడుగుతాడు. ఏమీ క్రొత్తగా చేయని అతను చివరకు ఏ పది, ఇరవై రూపాయలను పోగు చేసుకుని వెళ్తాడు. అలాగే నిత్య జీవితంలో ఏదో శక్తి వున్నట్లు నమ్మించి, మన నుంచి గుర్తింపును లేదా ఏదో ఒకటి ఆశిస్తాడు.

## కష్టాలు, సమస్యలు సామాన్యం

మనం శ్రీరాముడు, శ్రీకృష్ణుని అసాధారణ శక్తులను గురించి చెప్పుకుంటాం. కాని వాళ్ళు కూడ సాధారణ వ్యక్తుల మాదిరే ప్రవర్తించారు. వాళ్ళకూ సమస్యలు వచ్చాయి. మరెందుకు వాళ్ళ గురించి తలచుకుంటాం? వాళ్ళు తమ సమస్యలు, కష్టాలను, ఎలాగ ఎదుర్కొన్నారో తెలుసుకుందామన్నదే మన ఉద్దేశం. ఎవరైనా ఈ ప్రపంచంలో పూజ, జప, ధ్యానాదులను చేస్తే కష్టాలు రావని అంటే, వాళ్ళకు దూరంగా వుండాలి. ఎందుకంటే కొంతకాలం అలా వున్నట్లు అనిపించినప్పటికీ, అతనికీ, కష్టాలు, సమస్యలూ వుంటాయి. మనో బలహీనతల వల్ల కొంత కాలం నమ్ముతాము కాని, ఆ తరువాత అతను మోసం చేశాడని అంటాము. నిజానికి, అతను మోసం చేయలేదు మనమే అసాధ్యమైన దానిని నమ్మి మోసం చేసుకున్నాం.

అందుకే, నిజమైన, అసలైన సాధువు ఎవరంటే, మనకు కష్టాలు, సమస్యల మధ్య కూడ ఎదుర్కొనే బలాన్ని ఇవ్వగలిగిన వ్యక్తి. అంటే, కష్టాలు రాకపోవు, అనుకోని సమయాల్లో అనుకోని సమస్యలు వస్తూనే వుంటాయి. కాని జప, తప, ధ్యానాదులను హృదయ పూర్వకంగా ఆచరిస్తే, కష్టాలను ఎదుర్కొనే అలాంటి శక్తి కలుగుతుంది. అటువంటి స్థితిలో ‘‘దేవుడా! నాకెందుకు ఈ కష్టాలను ఇచ్చావని ఫిర్యాదు చేయం. భగవాన్ ఎంతో మహాత్ముడు. సమస్యలు ఎప్పుడు రావని నమ్మబలక లేదు. వచ్చిన కష్టాలను ఎదుర్కొనే శక్తితో సమస్యను పరిష్కరించవచ్చు కాని ప్రతిసారి విజయవంతులం అవుతామని నమ్మకం పెట్టుకోకూడదు.

కౌపీనవంతః ఖలుభాగ్యవంతః - తగిన దుస్తులు, అధునాతన దుస్తులు, లేకుండ, కౌపీనం మాత్రమే ధరించిన వ్యక్తులు చాలా అదృష్టవంతులని శంకరాచార్యులు అన్నారు. వారు ఎవరి నుండి ఏమీ ఆశించరు, ఇతరులకు శాంతిని ప్రసాదిస్తూనే వుంటారు. ఆ శాంతి మనకేదో కొత్తగా లభించిన దాని వల్ల కాదు; త్యాగం వల్ల లభించినది. వారు మీ మెప్పు కోసం, ఏదో కావాలని ఇవ్వరు. మీరు వారిని లెక్క చేయకపోయినప్పటికి పట్టించుకోరు. ఎందువల్ల? వేదాంత వాక్యైతు - వేదాలలో చెప్పబడిన దానిని ఆలోచనలో నిరంతరం పెట్టుకొని వుంటారు - న కర్మణాన ప్రజయా ధనేన ... త్యాగేనైకే - త్యాగం వల్ల. అన్నిటికంటే ఏది ఆ త్యాగం చేయడం కష్టం. ఆహారం మానవచ్చు. వదలడానికి అన్నిటికంటే కష్టమైనది అహంకారం. నేను ఒక ముఖ్యమైన వ్యక్తిగా పరిగణింపబడాలన్నది చాలా ముఖ్యమైనది; చాలా కష్టమైనది కూడ. మనకు పురాణాలు ఇదే చెబుతాయి. విశ్వామిత్రుడు గొప్ప ఋషి, కాని జ్ఞాని కాదు, ఎందుకంటే అతనికి చాలా అహంకారం. అలాగని సాధారణ ముని కాదు. గాయత్రీ మంత్రాన్ని రూపొందించిన వాడు. ఒహో స్వర్గం వుందా? అయితే నేను స్వంతంగా ఒక స్వర్గాన్ని సృష్టిస్తానన్నాడు. వశిష్ఠ మహామునితో వాదించి త్రిశంకు స్వర్గాన్ని రూపొందించాడు. అలాగే దూర్వాస మహాముని మామూలు ఋషి కాదు. కాని అతను తన ఆజ్ఞను పాటించిన వారిని వెంటనే శాపగ్రస్తులను చేసేవాడు. గ్రహించ వలసినది ఏమంటే నీవు ఎంతో గొప్పవాడై వుండవచ్చు గాక! అహంకారం వున్నంత వరకు శాంతిని పొందలేవు. ఇతరులను ప్రశాంతంగా వుంచలేవు కూడా!

## నిజమైన జ్ఞాని

భగవాన్‌ను ఒకసారి ఎవరో నిజమైన జ్ఞాని ఎవరు అని అడిగారు. కౌపీనం మాత్రం ధరించి ఎందరో తిరుగుతున్నారు కదా? ఎవరు అసలు జ్ఞాని, ఎవరు కాదు? తాము అసలైన జ్ఞాని అని భగవాన్ చెప్పలేదు. ఎవరి సమక్షంలో కూర్చున్నప్పుడు, నీవు కోరకుండగనే తనంతగా శాంతి లభిస్తుందో అతనే నిజమైన సాధువు, అసలైన గురువు అని బదులిచ్చారు.

కొన్ని సందర్భాలలో ప్రశాంతత కొద్ది కాలం పాటు మాత్రమే లభించవచ్చు. కొన్నిసార్లు ఎక్కువ కాలం వుండవచ్చు. మనస్సును ఎలా బహిర్గతం చేస్తే దాని బట్టి వుంటుంది. అంటే గురుకృప లభించినంత కాలం శాంతి అడక్కుండగనే తనంతట తానుగా లభిస్తుంది. మనం ఏదో అదీ, ఇదీ చేయాలని ఆలోచిస్తాం కాని ఆఖరుకు గురుకృప మీదనే ఆధారపడి నడుస్తుంది; ఏ కొద్దిపాటి శాంతి అయినా లభిస్తుంది. ఒక్కొక్కసారి అనుకోకుండగనే లభించ వచ్చు. అప్పుడప్పుడు అర్ధరాత్రి సమయములో మేల్కొని అసాధారణ మైన ప్రశాంతతను అనుభవించవచ్చు. ప్రపంచం మొత్తం నిశ్శబ్దంలో వున్నప్పుడు, మనసు కూడ స్థిరంగా వుండిపోయి ఎంతో ఆనందం కలుగుతుంది. అది క్షణకాలమేనా ఎక్కువ సేపా అన్నది ప్రశ్న కాదు. మౌనమైన మనసు ఎలా వుంటుందో ఆ ఆనంద అనుభవం ద్వారా తెలుస్తుంది. ఆ అనుభవాన్ని గురువు మనకు లభింపజేస్తాడు. మనం అది పూజ, జపాల ఫలితం వల్లననుకొంటాం. అవీ ముఖ్య మైనవే గాని అన్నిటి కంటే గురు ఆశీర్వాదం దయ, మౌలికమైనవి. గురు కృప కోసం విలపించాలి. అర్హులం కాకపోయినప్పటికి ఆయన ప్రసాదిస్తాడు.

## అక్కరకు రానిది

మనం షాపుకు వెళ్ళి ఏదో వస్తువు కొనాలనుకోవచ్చు. అక్కడ ఎన్నో రకాలైన ఆ వస్తువు వుంటుంది. ఏదో ఒక సబ్బు, ఉదాహరణకు బాగా శుభ్రపరుస్తుందని కొనవచ్చు. సబ్బు శరీరాన్ని శుభ్రపరుస్తుంది, నిజమే. కాని ఆ సబ్బును శరీరంపై రుద్దుకుంటే శరీరం శుభ్రమౌతుందా? మొదట నీళ్ళు అవసరం. నీళ్ళు లేకుండ, శరీరం తడిగా లేకుండా వుంటే, సబ్బు ఉపయోగపడదు. శుభ్ర పరిచే గుణం వున్నప్పటికీ, నీళ్ళు లేకుంటే సబ్బు దేనికీ పనికి రాదు. అంటే నీళ్ళు ముఖ్యం. మన పూజ, జప, ధ్యానాదులు సబ్బు వంటివి. అవి మన మనసును శుభ్రపరుస్తాయి. కాని అది జరగా లంటే నీళ్ళు అనబడే కృప వుండాలి. ఆ కృప అనే నీళ్ళు లేనప్పుడు, సబ్బు ఉపయోగం లేదు. నిజానికి, సబ్బు లేనప్పుడు కూడ, నీళ్ళు మాత్రమే వున్నప్పుడు కూడ ఒంటిని శుభ్రపరచుకోవచ్చు. ఎక్కువ మురికిగా వుంటే శరీరాన్ని మరింత గట్టిగా రుద్దుకోవాలి. మనకందరికీ ఒక విషయం తెలుసు. జలపాతం క్రింద నిలబడితే, ఏ సబ్బూ అవసరం లేదు, రుద్దనక్కర లేదు. జలపాతంలో పడుతుండే నీటి ఉధృతి కారణంగా దానంతట శరీరం శుభ్రమౌతుంది. అలాగే, గురువు దయ పరిపూర్ణంగా వున్నప్పుడు మరేదీ అవసరం లేదు. మరొక మాటలో చెప్పాలంటే మనం అవసరం అనుకునేది అక్కరలేక పోతుంది. ఇది కొందరి విషయంలో వర్తిస్తుంది. భగవాన్ ఎప్పుడూ ఏదీ కావాలని కోరలేదు. ఆయన పూర్తిగా అణ్ణామలై స్వాధీనంలోకి వెళ్ళిపోయాడు, అందుకే పూర్తిగా పరివర్తనం చెందాడు. అరుణాచలా! నన్ను పూర్తిగా

వశపరచుకున్నందుకు నీకు ఏ విధంగా కృతజ్ఞతలు తెలుపుకోవాలి, అంటారు భగవాన్. నేను నీవు కావాలని కోరలేదు. నన్ను బందీని చేశావు. అంటే, అరుణాచలుడు భగవాన్ మనసును పూర్తిగా స్వాధీనం చేసుకొనడంతో, ఆయన ఒక వ్యక్తిగా మిగలలేదు, అహంకారం పరిపూర్ణంగా నశించింది.

పుట్టుకతోనే భగవాన్ అరుణాచల పాద పద్మముల స్మృతిని కలిగి వున్నారు. మరో విధంగా చెప్పాలంటే ఆయనకు పదహారు సంవత్సరాల వయసులో అరుణాచలమన్న పదం విన్నంతనే అకస్మాత్తుగా ఆ స్ఫురణ మొదలైంది. అది పూర్వజన్మ సంస్కార ఫలితం.అప్పుడు ఆత్మానుభవం వరదవలె వచ్చిన దివ్యానుగ్రహ సుప్రవాహంతో, ఆయన వేలకొద్ది ప్రజల హృదయాలను పునీతం చేస్తూ వచ్చాడు.

అందువల్లే కృప అన్నది బహు ముఖ్యం. అది మనం అనుకోని సమయంలో మనల్ని ముంచెత్తుతుంది. అలాంటి సమయాలలోనే పూజాది కార్యక్రమాల వైపు మనసు మళ్ళి మనం పాల్గొనడం జరుగుతుంది. మనలో అహంకారం నశించినప్పుడు దేవుడిని స్మరించడానికి సైతం భగవాన్ కృప పనిచేసిందని తెలియవస్తుంది. దానిని గ్రహించడంలోనే గొప్పతనం వుంది. మన ప్రజ్ఞాపాటవాల వల్ల ఇతరులు గుర్తిస్తారని అనుకోవడం అవివేకం. గురువు అలాగ జరగాలని తలచుకొన్నప్పుడే అది జరుగుతుంది. స్వయంగా మనం ఏమీ చేయలేమని మన శక్తి సామర్థ్యాల వల్లే అలాగ అయ్యామని భావిస్తే, అది అహంకార లక్షణమే. మన ప్రవర్తనయే ఇతరులకు మన నిజస్వభావాన్ని, విలువను, తెలుపగలదు.

# శ్రీ దేవీ కాలోత్తర జ్ఞానాచారవిచార విభాగము

(గత సంచిక తరువాయి) తాడిమేటి సత్యనారాయణ

## 34వ పద్య తాత్పర్యము

మనస్సు ఎప్పుడు స్థిరత్వమును పొందునో, చలనరహితముగా నుండునో అప్పుడు, ఆ మనస్సును ఎటువంటి కారణము చేతను చలించునట్లు చేయకూడదు. ఏదైనా సందేహము కలిగిననూ, కొంచెమైన ఆలోచించ నవసరము లేదు. తన ఉత్పత్తి స్థానమైన ఆత్మస్వరూపమునందే, ఆ మనస్సును బాగుగ నిగ్రహించి, చలించక నిశ్చలముగా నుండునట్లు చేయుదువుగాక.

## వ్యాఖ్య

మనస్సు పరిపరి విధముల పోవుటయే దుఃఖమగును. స్థిరముగా ఒక స్థితిలో నుండక, పరుగులిడు మనస్సు ఎప్పుడైననూ స్థిరత్వమును పొందినచో దానిని చంచల మొందనీయకుమని తెలుపుచున్నారు. ఎంతో చలించిన మనస్సు, ఎట్లు ఇంత స్థిరముగా నున్నదని ఒక సందేహము కల్గిననూ, దానికి రవ్వంతైనను ఆలోచించుటకు అవకాశము యివ్వవలదు. ఈ స్థితిలోనే ఉండు మని భావము. సడలిన మనస్సు తిరిగి ఆలోచనలకు వశమగును. అందుచే మనస్సు పుట్టు చోటైన ఆత్మస్థితిలో దానిని బంధించినచో నిశ్చలముగా నిలచిపోవును.

మనస్సు యొక్క చంచలత్వము అణగిన స్థలమే పూర్ణానంద స్వరూపమగును. ఆనందము పొందిన యెడల మనస్సణుగును. మనస్సణగిన తప్ప ఆనందము లభ్యముకాదు. కనుక ఏదో

విధముగా దీనిని బంధించి నిశ్చలముగా నుంచుటయే పురుషార్థము. మనఃప్రవృత్తులను ఎదిరించి నిర్మూలించుటకు ఎవరికైననూ దుస్సాధ్యమే. అయితే దానిని జయించి చలించకుండునట్లు చేయుటకు ఉపాయమేమనగా మనస్సనునది ఒక వస్తువు గాదు, కేవలము అసత్యరూపమని తలచి, దానిని లెక్కచేయక ఉదాసీనముగా వుండి, మనస్సుకు ఆధారమైన ఆత్మను వెదకి అందు స్థిరముగా నుంచిన యెడల, ఇక దాని గురించి పట్టించుకొనువారు లేక, మనస్సు కొంచము కొంచము సడలి చివరకు నాశమొందును.

## 35వ పద్య తాత్పర్యము

తన సహజమైన ఉనికిని (ఆశ్రయమును)వదలి, ఇంద్రియములచే విషయములను ఆశ్రయించి పట్టుకొను మనస్సును అట్లు ఆశ్రయించకుండా బాహ్యమున ఎటువంటి ఆధారములు లేకుండ చేయుము. తనకు అన్యమైన ఆశ్రయమును పట్టుకొను చపలత్వమును పోగొట్టి నిశ్చలమగునట్లు చేసి, ఆ నిశ్చల స్థితిని కొంచెమైననూ చలించనీయకుము.

## వ్యాఖ్య

మనస్సు తన సహజ ఆశ్రయమైన స్వరూపమును వదలి జారి, చలించి తనకు ఆశ్రయముగ పట్టుకొనుటకు, పంచేంద్రియ విషయములను ఆశ్రయించుచున్నది. తిరిగి తన యథార్థ స్వరూపమును పట్టుకొనునట్లు చేయవలెననగా, బయట పట్టుకొనుటకు ఎటువంటి ఆధారములు లేకుండా చేయవలెను. విషయములను పట్టి పోవునపుడు మనస్సు చంచలమగుచున్నది.

పట్టుకొనుటకు విషయములేవీ లేనప్పుడు నిశ్చల స్థితిని పొందుచున్నది. అట్టి స్థితిని పొందిన మనస్సును కొంచమైననూ చలించనీయవద్దని ఉపదేశించుచున్నారు. మనో చాంచల్యమును గమనించుటయే మన సహజస్థితి నుండి జారుటయగును. ఆ చలనమును గమనించక తననే గమనించినచో మనో చాంచల్యము తానంతట అణగిపోవును. అదియే నిశ్చలమైన స్థితి యగును.

## 36వ పద్య తాత్పర్యము

పంచభూతములగు ఈ భూతములన్నియు లయమగు నపుడు, ఈ భూతములందు గల ఆయా ఆకాశములు, వాటిచే (ఆ భూతములచే) కల్మషమునొందక నిర్మలముగా నుండునట్లు, సృష్టిలోని అన్ని రూపములందు వ్యాపించి యున్నదియూ, వాటియందు గల ఏ ఒక్క దోషము పట్టక దోహరహితుడుగా నుండు నీ స్వరూపమును ధ్యానింతువుగాక.

## వ్యాఖ్య

ఆకాశము ఇతర నాలుగు భూతములతో కలిసియున్ననూ, ప్రళయకాలములో ఆ నాలుగు భూతములు లయము నొందుచున్నప్పుడు, వాటి గుణములు ఆకాశమునకు అంటుకొనుట లేదు. ఆకాశము వాటితో చేరియున్ననూ, అతి సూక్ష్మముగా నుండుట వల్ల కల్మషము లేక నిర్మలముగా నున్నది. దానికి ఎటువంటి దోషములు అంటవు.

సమస్త వస్తువుల లోపల బయటనూ ఆకాశము వ్యాపించి యున్ననూ, వాటి ధర్మములేవియు దానిని అంటుట లేదు, ఆ విధముగనే ప్రపంచము నందలి సమస్త రూపములందు పరవస్తువు

వ్యాపించియున్ననూ అది ఆ ఉపాధి ధర్మములు కొంచెమైననూ పట్టని సాటిలేని వస్తువుగా ప్రకాశించుచున్నది.

ప్రపంచమున జరుగు శుభాశుభ కార్యములు సూర్యుని అంటునట్లు భూమి, అగ్ని, జలము, వాయువు అను ఈ నాలుగు భూతముల గుణములూ, అనంతమైన ఆకాశమును అంటనట్లూ, ప్రపంచములోని ప్రాణులు చేయు కర్మదోషములు, ధర్మములన్నియయూ, ఆ రూపములలో వ్యాపించియున్న పరవస్తువును అంటనే అంటవు. ఈ ప్రపంచ సృష్టికి కారణమైన సమస్త భూతములు ఒకప్పుడు లయమై పోవును. లయమగు నపుడు ఆ భూతములతో సంబంధించిన ఆకాశము వాటి దోషములతో మలినము కాదు. ఆకాశమును భూమి ఆకర్షించలేదు, నీరు దానిని తడపలేదు, గాలి దానిని చలింపచేయలేదు. ఆ విధముగ ఆత్మ ఏ ఉపాధి ధర్మము లతో నంటదు. ఆ ఆత్మను ధ్యానించుము.

## 37వ పద్య తాత్పర్యము

ఎడతెరిపి లేక సదా చలించు గాలికి సమానమైన మనస్సును, ఎల్లప్పుడు చలించక నిశ్చలముగా నుండునట్లు చేయు సాధనమేదియెూ, అదియే, ఆ ధ్యానమును చేయుటయే మానవజన్మకు సాఫల్యము, ముఖ్య ప్రయోజనము నగును. పైగా అదియే సకల శాస్త్రములు పఠించి నేర్చిన విద్య యొక్క మూలశక్తి యగును.

## వ్యాఖ్య

వేదాంత గ్రంథములలో మనస్సు యొక్క చలనమును గూర్చి చెప్పునపుడు, వాయువుకంటే, కోతికంటే అతి చంచలమైనదనియూ,

దాని వేగము వాయువేగము మనో వేగమనియు చెప్పబడినది. ఇంద్రియముల వేగమును గూర్చి చెప్పుచున్నప్పుడు, గుఱ్ఱము యొక్క వేగముతో ఉపమానముగా చూపించబడుచున్నది. ఈ మనోవేగమును, నియంత్రించిన ధీరుడే మహా పండితుడు అనబడు చున్నాడు. అంతేగాని అరవైనాలుగు కళలను నేర్చినవాడు పండితుడు గాదు. మనోచాంచల్యమును నియంత్రించు సాధనను తెలిసికొన్నవాడే అన్నియు నేర్చిన పండితుడు. నేర్చిన విద్యలన్ని అజ్ఞానమని గ్రహించి, వాటిని నేర్చిన తాను ఎవరు? అని విచారించు వాడే, సకల విద్యలను బాగుగ నేర్చిన విద్యావంతుడు.

మనోచాంచల్యమును అణచుటకు గల ఉపాయము, మనస్సును దాని ఉత్పత్తి స్థానములో నుంచుటయేం. చిత్తచంచలనమే జన్మదుఃఖమునకు బీజమగు చున్నది. కనుక ఏ విధముగనైనను కష్టపడి చలించు మనస్సును, నిశ్చలముగా నుంచుటయే ఈ జన్మకు ప్రయోజనము, చదివిన చదువుకు అర్థము. చలించే మనస్సు జీవుడు. నిశ్చలమైన మనస్సే బ్రహ్మము.

## 38వ పద్య తాత్పర్యము

షడాధార స్థానములోను, పైన మధ్య క్రిందనూ, వేరెచ్చటనూ మనస్సును ధారణ చేయవలదు. ఈ మనస్సు లోపల అంతరంగ మున చేయు భావనను వదలి, బయట ఎటువంటి వాటిని ఆశ్రయించి పట్టుకొనుటకు తావీయక సతతము స్థిరముగా ఉందువుగాక.

## వ్యాఖ్య

మనస్సు ఏకోన్ముఖమగుటకు, ఆరు ఆధార చక్రములలో

ఏదో ఒకదాని పైన ధారణము చేసి, సాధన చేసి అభ్యసించుట ఒక పద్ధతియగును. ఆ విధముగ చేయవద్దని చెప్పుటలో కారణము, మనస్సు దేనిని పట్టుకొన్నను అనర్థమే. దానిని విడిపించుట అతి ప్రయాసతో గూడిన పని. అందుచే మనస్సే లేకుండా చేయుట నిజమైన ధారణ. వాస్తవముగా ధారణ యనునది ఒక భావన. మనస్సు భావనాతీత స్థితికి పోవలెనన్న భావనలను నిర్మూలించుటయే సాధనయగును. మనస్సున అనేక మంత్రములను, రూపములను, అంతరంగ భావన చేయుటను నిర్మూలించుటతో పాటు, బయుట కూడ అది పట్టుకొనుటకు ఆశ్రయము కల్పించకుండా ఎల్లప్పుడు సడలక ఉండమని తెలుపుచున్నారు.

బంధములకు కారణమైన వాటినన్నటిని నిర్మూలించినచో మనస్సు తానే అణగిపోవును. ఎందువల్లననగా, లోపల పట్టుకొనుటకు విషయములు లేనిచో బయటికి వచ్చి ఏదో ఒకదానిని పట్టుకొని తిరుగుట దాని నైజము. అట్లు పట్టుకొనుటకు విషయములు లేనిచో మనస్సు తన చంచలత్వముడిగి అణగిపోవును.

## 39వ పద్య తాత్పర్యము

(ధ్యానములో) నిద్రవచ్చినచో మనస్సును నిద్రనుండి లేపి, మెలకువగా వుండునట్లు చేయుము. మనస్సు మెలకువలోకి వచ్చిన వెంటనే చలించినచో దానిని అణచివేయుము. ఇట్లు నిద్ర చలనము అను ఈ రెండు కాని స్థితిని పొందినచో, నిజస్థితి యగును. ఇందు చలించక నిశ్చలముగా నుందువుగాక.

## వ్యాఖ్య

మనస్సును లోపల అంతరంగములో భావనచేయనీయక

నిరోధించుట చేతను, బహిర్ముఖమై విషయ వస్తువులను పట్టుకొని తిరుగుటకు వీలుకానట్లు చేయుటచేతను, అంతర్గతము కాలేక, బయట కూడా దీనిని ఆశ్రయించలేక మనసు సంకోచించి నిద్రలో మునుగుచున్నది.

మనస్సు దేనినీ పట్టుకొనక వుండలేదు. లోపల బయటను విషయములను పట్టి తిరుగు మనస్సు, ఒంటరిగా నిలుచున్నప్పుడు దానికి నిద్ర ఒక్కటే మార్గము. ఆ నిద్రను తానే పొందక్కరలేదు. అదే ఇతని ఒంటరితనమును తెలిసికొని ఆవరించుచున్నది. అటువంటి నిద్రనుండి మనస్సును మేలుకొలుపుమని చెప్పబడినది.

ధ్యానకాలములో నిద్ర వచ్చినచో అందుండి మేల్కొని, అటు పిమ్మట రేగిన తలంపులను లెక్కించకుండా, తలపులను నిర్మూలించి నిశ్చలము చేయవలెను. ఇట్లు మారిమారి, వాటితో పోరాడి, సాధన చేయుటవల్ల, ఈ రెండునూలేని స్థితి కలుగును. అదే నిజమైన స్థితియగును. అందు చలించక నిశ్చలముగా నుండుమని బోధించుచున్నారు.

విషయ సంబంధములు లేక నిద్రలో నుండునట్లు శాంతము గనూ, అదే సమయమున తాను మాత్రము మెలకువలో నుండ వలెను. అయితే ఆ మెలకువలో తలపుల చలనము కొంచెమైనను ఉండకూడదు. నిద్రలాంటి శాంతి, మెలకువ వంటి ప్రజ్ఞయు చేరిన స్థితియే రెండు కాని స్థితి యని పైన తెలిపిన భావము. ఇదియే జాగ్రత్ సుషుప్తియని చెప్పబడుచున్నది.

నిద్రకు చోటిచ్చినచో, ఆ అంధకారములో తనను పోగొట్టు కొనుచున్నాడు. అప్పుడు విచారణ చేసి, వస్తువును పొందలేడు.

చలనము లేనిదైనను, మనస్సు వ్యాపించియుండుటచే అక్కడనూ దానిని పొందలేడు. నిర్విషయమైన మనస్సు, కావలసిన పరిణతి లేనందున ఈ రెంటిని వదలి ఒంటరిగా నుండలేక సంకోచములో పడుచున్నది.

నిద్ర పోకూడదు. మనస్సును పరిపరి విధాల చలించనీయ కూడదు. మరేమి చేయవలెను? ఈ రెండు కాని స్థితిలో నిశ్చలముగా నుంచుమని తెలుపుచున్నారు. ఇదే సమాధి స్థితి. ఇందులో వుండుమని ఉపదేశించుచున్నారు.

## 40వ పద్య తాత్పర్యము

(ముందు పద్యములో చెప్పిన విధముగా మనస్సు నిశ్చలతను పొందక బహిర్ముఖమైనచో) ఆ మనస్సు ఆశ్రయించుటకు వేరు స్థలమేదియు లేనిదై, తన దోషములన్ని పూర్తిగా నాశమగునట్లు, అన్ని రకములైన బంధములను ఎప్పుడూ తొలగినదై మనసు యొక్క అవస్థలనబడు ఆశాపాశములను పొందకుండుటయే, జ్ఞానముచే పొందగల ముక్తి లక్షణమగును. ఈ భావమును మనస్సున స్థిరముగా నుంచుకొనుము.

## వ్యాఖ్య

మనస్సు తన స్థానమును వదలి బహిర్ముఖమైనప్పుడు దేనినైనా పట్టుకొనిన తప్ప నిలబడలేదు. అది ఏదొ ఒక తలపును పట్టుకొని, అందు విసుగు చెందిన దాని నుండి మరొక తలపునకు గెంతుచూ, విరామము విశ్రాంతి లేక తలపుల సుడిగుండములో చిక్కి తిరుగుచున్నది. మనస్సనగా యేమియని చూచిన, మనస్సనేది వేరే లేదు. తలపులే మనస్సు.

మనస్సునకు ఆశ్రయమైన విషయములను త్రోసిపుచ్చిననే, మనస్సు నిర్మలమగుచున్నది. అందుకు దానిని తలపులను పట్టి పోకుండ చేసినచో, అది బంధరహితమగుచున్నది. నిరపేక్షయగు చున్నది. దోషములన్నియు మనోబంధముల వలనే కలుగుచున్నవి. నిరపేక్షమైన మనస్సు దోషరహితమై నిర్మలమగుచున్నది. నిర్మల మనస్సును ఆశాపాశ బంధములతో ఎటువంటి అవస్థ కూడా ఆవరించదు.

ఈ విధముగా నిరాశ్రయమై, నిరపేక్షమై, దోషరహితమై, ఆశా పాశములనెడు అవస్థలను పొందని మనస్సును స్థిరముగా నుంచు కొనుటయే జ్ఞానముచే పొందగలుగు ముక్తియొక్క లక్షణమని స్థిరముగా మనస్సులో నుంచుకొనుము.

మనస్సు యొక్క అవస్థలలో మహాక్రూరమైనది ఆశాపాశ బద్ధమగుటయే. దీని నుండి విముక్తి నొందుట శ్రమసాధ్యమైన సాధనయగును. ''ఆశా ఆశా పరమ దుఃఖము, నిరాశా పరమ సుఖ'' మని పెద్దల వాక్యము. ఆశల వల్ల కలుగునది కలవరం పోరాటం. ఆశలు లేనిచో కలుగునది ఆనంద మౌన సుఖమని తెలుసుకొనుమని ఈశ్వరుడు తెలుపుచున్నారు.

## 41వ పద్య తాత్పర్యము

మనస్సులో సకల ఆలంబనలను, కొంచమైననూ మిగల్చక నిర్మూలించి, ఆ మనస్సును హృదయములో బాగుగ హత్తుకొని యుండునట్లు చేసిన అప్పుడు, ఏ ఒక ప్రజ్ఞ అతి ప్రకాశముగా గోచరించుచున్నదో, ఆ ప్రజ్ఞ బలపడునట్లు, ఎల్లప్పుడు నిరంతరమూ అభ్యసించెదవుగాక.

**వ్యాఖ్య**

మనస్సు తాను పట్టుకొనిన సకల ఆలంబనలను వదలిననే, హృదయములో బాగుగ నిలబడగలదు. లేనిచో మనస్సు హృదయములో మునుగుట వాసనలు దానిని బయటికి త్రోయుట వంటి ఆగని పోరాటమే జరుగును. మనస్సులోని వాసనలు పూర్తిగ నశించినపుడు, అది హృదయములో నిశ్చలముగా నుండు అర్హత పొందుచున్నది. అట్లు స్థిరముగా హృదయములో నిలబడినపుడు, పూర్ణ సత్యజ్ఞానము అతి ప్రకాశముగా వెలిగి గోచరించుచున్నది. అట్లు గోచరించిన పూర్ణ సత్య జ్ఞానమును జారవిడువక, అందు లయమై యుండుటకు ఆ జ్ఞానము బాగుగా బలపడవలెను. అట్లు బలపడుటకు అనుసరించి అలవాటు పడి, స్థిరపరచు కొనుమని భావము.

పూర్ణ జ్ఞానము హృదయములో గోచరించినప్పుడు, జారవిడువక దానినే పట్టుకొని యుండులాగున అలవాటు పడినచో, మనస్సు దానిలో కరిగి ఏకమై పోవును. కరిగి ఏకమైన మనస్సునకు ఎటువంటి దోషములంటవు. మనస్సు కాలి బూడిదైన త్రాడువలె యగును. మచ్చలు, మలినము పోవునట్లు మెరుగు పెట్టిన రత్నము యొక్క కాంతి వలె, మచ్చలు లేని మనస్సులో దైవ కృప ప్రకాశించును. దైవ కృపతో ప్రకాశించు మనస్సునకు ఎటువంటి దోషములంటవు. ప్రపంచ బంధపాశములంటవు. బంధ పాశములు లేని మనసు ముక్తి సుఖమును పొందుచున్నది. కనుక సత్యజ్ఞానము దృఢపడునంతవరకు సదా అభ్యసించి ఆచరించుము అని చెప్పబడుచున్నది.

# శ్రీ భగవాన్ రమణమహర్షి స్మృతులు
## (శ్రీదేవరాజ ముదలియార్)

(గత సంచిక తరువాయి) అనువాదం: జి. శ్రీహరిరావు

అయితే ఎన్నో ప్రామాణిక గ్రంథాలలో మనం చదువు కుంటాము: ఒక జ్ఞాని కటాక్ష వీక్షణంతో మన ప్రారబ్ధంతో సహా అన్ని కర్మ ఫలాలన్నిటి నుండీ మనం బయటపడతాము. ఈ గ్రంథాలు కూడా శ్రీ భగవాన్ ఆమోదము పొందిన గ్రంథాలే!

"ఈ విషయంపై శ్రీ భగవాన్‌తో తన సంభాషణ గురించి శ్రీ జానకీ మాత తమ పత్రిక 'అరుళ్' లో ప్రస్తావించారు." శ్రీ భగవాన్ అనుగ్రహం వుంటే ఎలాంటి ప్రారబ్ధాన్నైనా మనం అధిగమించ గలమని తానన్న మాటకు సమాధానంగా, "అంత నమ్మకముంటే అలాగే జరుగుతుంది" అన్నారట శ్రీ భగవాన్.

శ్రీ భగవాన్ ఆస్థాన విద్వాంసుడైన శ్రీ జగదీశ్వర శాస్త్రి గారు మృత్యుశయ్యపై వుండి, చివరిసారిగా శ్రీ భగవాన్‌కు తన ఆక్రోశాన్ని పద్యరూపంలో యిలా రాశారు. ప్రారబ్ధాన్ని అనుభవించవలసినదే అని శ్రీ భగవాన్ యెన్ని చెప్పినా తాను విననని, శ్రీ భగవాన్ అనుగ్రహిస్తే తాను ప్రారబ్ధాన్ని అధిగమించి రక్షింపబడతాననీ పద్య సారాంశము. శ్రీ భగవాన్ కరుణ వల్ల వారు మృత్యువు బారి నుండి బయటపడి, యిప్పుడు మద్రాసులో సుఖంగా వున్నారు. నేనేకాదు, అనేకమంది శ్రీ భగవాన్ సన్నిహిత భక్తులు కూడా, ఆయన కేవలం శ్రీ భగవాన్ అనుగ్రహం వల్లనే, తాము మృత్యువాత నుండి బయట పడ్డారని నమ్ముతారు.

ఈ సందర్భంగా, ప్రారబ్ధవశాన పడాల్సిన కష్టాలను శ్రీ భగవాన్ తమ కరుణ వలన యెలా వారించారో తిరుచ్చుళిలో ఒక సన్నివేశము నాకు గుర్తొస్తున్నది. శ్రీ భగబాన్ బాల్య స్నేహితుడైన శ్రీ రంగయ్యర్ తరువాత కూడా శ్రీ భగవాన్‌ను ఆశ్రయించి వారికి భక్తుడైనారు. తన చెలికాడైన శ్రీ రంగయ్యరు పట్ల శ్రీ భగవాన్ కూడా ఎంతో ప్రేమ, ఆదరణ చూపేవారు. ఒక సందర్భంలో శ్రీ రంగయ్యరు చాలా గడ్డుకాలాన్ని ఎదుర్కోవలసి వచ్చింది. అనేక కష్టాలు ఆయనను చుట్టుముట్టాయి - ఆర్థికపరమైనవీ, ఇతర సంబంధమైనవీ. ఒక సంవత్సరము పాటు ఆయన భీకర కష్టాలు ఎదుర్కోవలసి వస్తుందని సమర్థవంతులైన జ్యోతిష్కులు ఆయనను హెచ్చరించారు. ఆ కష్టకాలము మొదలైన కొద్ది రోజులకే ఆయనకు ఇబ్బందులు మొదలగుటవలన, వారు శ్రీ భగవాన్‌ను సంప్రదించాలని వారి వద్దకు వచ్చారు. కష్టాలుంటాయని చెప్పబడిన మిగిలిన సమయమంతా వచ్చి తన దగ్గర వుండమని శ్రీ భగవాన్ ఆయనకు సలహా యిచ్చారు.

శ్రీ భగవాన్ సలహా మేరకు వారి సన్నిధిలో వుండటం వల్ల, అధిగమించలేని ఎన్నో కష్టాల నుండి తను బయటపడ్డానని శ్రీ రంగయ్యరు నాతో చెప్పారు. మిగిలిన పది నెలలూ, తన సన్నిధి వదిలి కొద్ది గంటలు కూడా వుండవద్దని శ్రీ భగవాన్ ఆయనకు నచ్చ చెప్పారు. శ్రీ భగవాన్ రక్షణలేని సమయం చూసి ఆయనను కబళించి వేయటానికి దుష్టశక్తులు పొంచి వున్నట్లుగా కనిపించింది. ఆ సమయములో, తనను చూడటానికీ, శ్రీ భగవాన్‌ను దర్శించ డానికీ, వచ్చిన ఒక స్నేహితుడికి వీడ్కోలు పలకడానికి రైల్వేస్టేషను వెడుతున్నప్పుడు కూడా, పని అవ్వగానే ఊళ్ళో యెక్కడా

తిరగకుండా రాత్రికి ఊళ్లో ఆగకుండా, వెంటనే వెనక్కి వచ్చేయ మని ఆదేశించారు శ్రీ భగవాన్. ఇవన్నీ కూడా శ్రీ రంగయ్యర్ నాతో చెప్పారు. ఆయన పట్ల శ్రీ భగవాన్ అనుగ్రహం పూర్తిగా వున్నదనీ, రంగయ్యర్ గారి పట్ల శ్రీ భగవాన్‌కు చాలా ప్రేమాభి మానాలున్నాయనీ నాకు తెలుసు. అనుగ్రహం గురించి శ్రీ భగవాన్ బోధన ముగించేముందు ఒక మాట చెప్పాలి. అనుగ్రహమూ, కరుణా పరమశక్తివంతమయినవి శ్రీ భగవాన్ నాతో స్పష్టముగా చెప్పకపోవడానికి కారణము నేనూహించగలను. వారలా చెప్పి నట్లయితే, శ్రీ భగవాన్ అనుగ్రహం వుంటే చాలు అని భావించి నా ఆధ్యాత్మిక సాధనపట్ల నేనింకా ఉదాసీనత పెంచుకొని బద్ధకస్తుడిని అవుతానేమోనని శ్రీ భగవాన్ ఉద్దేశ్యమై వుండవచ్చు. ఎవరికి యెట్టి బోధన చేయాలో శ్రీ భగవాన్‌కు చాలా బాగా తెలుసును. ఆయన బోధన, భక్తులకు వారిచ్చే సమాధానాలూ, వారి వారి తత్వాలను బట్టి ఆధారపడి వుంటాయనేది నిస్సందేహము. నా నైజము ప్రకారము నేను చాలా బద్ధకస్తుడను. ఈ బద్ధకము పెరగకుండా వుండాలని శ్రీ భగవాన్ ఉద్దేశ్యమని నేను భావిస్తాను. అందువల్లనే నేనీ విషయము ప్రస్తావించినప్పుడల్లా శ్రీ భగవాన్ మౌనము వహించేవారు. ప్రారబ్ధ ఫలాన్ని, అనుగ్రహం అధిగమించలేదని శ్రీ భగవాన్ యెప్పుడూ చెప్పలేదు. నేనింతకు ముందు ప్రస్తావించిన అనేక సంఘటనలలో, శ్రీ భగవాన్ కరుణ నన్నెలా ప్రారబ్ధఫలాల నుండి కాపాడిందో నేను తెలియపరిచాను. రాబోవు ఆపదలను గురించి నా జాతకము చూసిన నా స్నేహితులు నాకు ముందే చెప్పేవారు. (ఈ రచన శ్రీ రమణాశ్రమము ద్వారా ప్రచురింప బడిన 'మై రికలక్షన్స్ ఆఫ్ భగవాన్ శ్రీ రమణ మహర్షి' అనబడే గ్రంథము నుండి అనువదింపబడినది.)

# కుండిలిని మేల్కొనుట

దోనెపూడి వెంకయ్య

కుండిలినియే ఆత్మ, భగవంతుడు, శక్తి చైతన్యము (Consciousness) ప్రేమ, భక్తి, జ్ఞానము ఇలా వేరు వేరు పేర్లతో పిలువబడుతుందని భగవాన్ శ్రీరమణ మహర్షి చెప్పారు. ముఖ్య ప్రాణము నుండి అహంత, ప్రాణము వస్తాయనీ, ప్రాణశక్తియే కుండలిని అని చెప్పారు. కుండిలినీ శక్తిని భక్తులు భగవదాకారవృత్తి అనీ, జ్ఞానులు (బహ్యాకారవృత్తి అనీ అంటారు. కుండలిని హృదయంలో ఉంటుందని జ్ఞానులు, మూలాధారంలో ఉంటుందని యోగులు చెబుతారు. హృదయమే రెంటికీ మూలస్థానములని భగవద్వచనము.

కుండలినియే అఖండాకారవృత్తి లేక అహం స్ఫురణము. అది హృదయము కంటె వేరు కాదు. రమణగీతలో, 'గ్రంథి భేదన కథనం' అనే నవమో ధ్యాయంలో గ్రంథి రెండు, విధాలుగా ఉంటుందనీ, అది దేహపరంగా నాడీబంధి, గ్రంథి అనీ, జీవపరంగా అభిమాన గ్రంథి అనీ చెప్పబడింది. అసలు ఉన్నది హృదయ గ్రంథి ఒక్కటే, అదే చిజ్జిదగ్రంథి అని కూడా అన్నారు భగవాన్.

భవానీ సహస్రనామ వ్యాఖ్యానంలో గ్రంథి భేదనమొనర్చి, కుండలిని మేల్కొనుటకు మూడు స్థాయిలలో ఉంటుందని పేర్కొనబడింది. భౌతిక స్థాయిలో ప్రాణకుండలిని, భావ () స్థాయిలో నాదకుండలిని, ఆధ్యాత్మిక స్థాయిలో బోధకుండలిని లేక జ్ఞాన కుండలిని మేల్కొంటాయి. భౌతిక స్థాయిలో హఠయోగ సాధనల

వలన ప్రాణకుండలిని మేల్కొంటే అష్టసిద్ధులు లభిస్తాయి. భావస్థాయిలో భక్తి యోగసాధనల వలన కాదకుండలిని మేల్కొంటే కవిత్వము మొదలగు లలితకళలల యందు ప్రావీణ్యము, వక్తృత్వ శక్తి, కంఠ మాధుర్యము, తత్త్వచింతనము చేయగల మేధస్సు లభిస్తాయి. ఆధ్యాత్మిక స్థాయిలో జ్ఞాన యోగ సాధనల వలన బోధకుండలిని మేల్కొంటే సర్వము ఆత్మ మయముగా అనుభూత మవుతుంది. హృదయము విశ్వప్రేమతో స్పందిస్తుంది. అది ఆత్మ సాక్షాత్కార స్థితి. కుండలిని భౌతిక, భావ, ఆధ్యాత్మిక స్థాయిలలో మేల్కొన్న భగవాన్ శ్రీరమణ మహర్షి దృష్టాంతము నాన్యతో దర్శనీయము.

# శ్రీరమణ హృదయ గీతిక

యనమండ్ర సంధ్యాదేవి

పల్లవి: హృదయమే నీ ఆలయం శ్రీరమణా
నీ నామమే నా గానం
మరువను మరువను నీ స్మరణం
విడువను విడువను నీ చరణం

1. మంచిదారిలో నడిపించి
మాయపొరలనే తొలగించి ॥మంచి దారిలో॥
భక్తుల ప్రార్థన ఆలకించి
మాలో జ్ఞానము వెలిగించి
శరణు శరణు శ్రీరమణా
శరణు శరణు భవహరణా ॥హృదయమే॥

2. మౌనభోదలే ఉపదేశముగా
ధ్యానయోగమే సాధనగా ॥మౌన భోదలే॥
భక్తుల మదిలో కొలువు తీరగా
శరణు శరణు శ్రీరమణా
శరణు శరణు భవహరణా
హృదయమే నీ ఆలయం శ్రీరమణా

# శ్రీరమణ మహర్షి యొక్క భక్తాగ్రేసరులు

# స్వామి రంగనాథానంద

మల్లాది ఫణిమాల

స్వామి రంగనాథానందులవారు శ్రీరామకృష్ణ మఠానికి అధ్యక్షులుగా వ్యవహరించారు. శ్రీరమణులను తొలిసారి దర్శించుకున్నప్పుడు శ్రీమద్ భాగవతాన్ని పరీక్షిత్ మహారాజుకు బోధించిన శుకమహర్షిని దర్శించుకున్న భావన స్వామి రంగనాథానందుల వారికి కలిగింది. ఎందుచేతనంటే ఆత్మలో రమిస్తూ ఏ బంధము లేకుండా, దేని చేత అంటబడకుండా, ఆనందంగా ఉండేవారు వీరిద్దరూ... అవ్యాజమైన కరుణకు, ప్రేమకు శ్రీరమణులు మరియు శుక మహర్షి - వీరివురు నిలువెత్తు నిదర్శనాలని స్వామి రంగనాథానందుల వారు విశ్వసించారు.

స్వామి రంగనాథానందుల వారు శ్రీ రమణాశ్రమానికి రెండు సార్లు వెళ్లడం జరిగింది. 1936వ సంవత్సరంలో మొట్టమొదటి సారిగా వారు శ్రీరమణాశ్రమంలో అడుగుపెట్టారు. తొలిసారిగా శ్రీరమణులను దర్శించుకున్నప్పుడు భగవాన్ శ్రీ రమణులు రాశీభూతమైన భగవత్-సత్య-స్వరూపమని గ్రహించి ఆ దివ్య పారవశ్యంలో శ్రీ రమణులను గురించి తన మాటలలో ఎంతో వైభవోపేతంగా ఇలా ఆవిష్కరించారు, శ్రీ రంగనాథానందుల వారు.

"భగవాన్ శ్రీ రమణులు అసాధారణులు. శ్రీమద్ భాగవతంలో చెప్పబడినట్లుగా, మహాత్ముని పట్ల మమకారం కలిగి ఉండటమే జనన మరణ చక్రము నుండి విమోచన కలిగించగల శక్తి శ్రీ

రమణుల వంటి శాంతచిత్తులు, కరుణాపూరితుల పట్ల ప్రేమ, భక్తి మరియు మమకారం కలిగి ఉండుట మాత్రం చేత జీవులు ఉద్ధరింపబడతారని స్వామి రంగనాథానందుల వారు అన్నారు. అమరులు, నిత్యులు అయిన శ్రీ రమణులది పరమోత్కృష్టమైనటు వంటి స్థితి. అరుణాచలంలో జ్యోతి స్తంభంలా తనను తాను ప్రకటించుకున్న పరమేశ్వరుని యొక్క ఆద్యంతములు అంచనా వేయడం ఎంత అసాధ్యమో...శ్రీ రమణులను కూడా అంచనా వేయడం అంతే అసాధ్యం! వారెంత ఉన్నతులో, ఎంత గంభీరులో మనబోటి మానవులము ఎలా తెలుసుకోగలము! ఏ విధంగా వారి అత్యున్నత స్థితిని అభివర్ణించగలము!!

మహర్షి మహనీయతను, వారి విలక్షణతను, గురువుగా వారి గొప్పతనాన్ని సంపూర్ణంగా తెలుసుకోగల శక్తి మానవమేధస్సుకు లేదు. ఇంత మహోన్నత స్థితిలో రమించే శ్రీరమణులు మనందరి నడుమ అతి సాధారుణుల్లా మసలేవారు. అందుచేతనే శ్రీ రమణులు దేహధారులై ఉండగా వారిని దర్శించుకోగలిగిన వారు నిజంగా ధన్యులని స్వామి రంగనాథానందుల వారు అన్నారు. శ్రీరమణ స్పర్శ అమరం. వారి వీక్షణం మోక్షానికి హేతువు. దాని వల్ల సకల జీవులు ఉద్ధరింపబడడం తథ్యం!!

ఒంటరిగా కూర్చుని ఉన్నా, మౌన సముద్రంలో మునిగి ఉన్నా, ప్రూఫులు దిద్దుతున్నా, కూరలు తరుగుతున్నా, ఎల్లప్పుడూ శ్రీరమణులు ఆత్మనిష్ఠులై ఉండేవారు. నిత్యమైనది, దివ్యమైనది వారిలో మూర్తిమంతమయింది. వారి చుట్టు చేరిన భక్తులతో శ్రీరమణులు పలికిన ప్రతి పలుకు ఆత్మ విద్యాభరితము. నిత్యంలో

నివసించే మహర్షి తమ వద్దకు వచ్చిన వారిలో అంతర్యాలను ఎప్పుడూ పాటించి ఎరుగరు. విధ్వాంసులైనా - పామరులైనా, సేవకులైనా-మహారాజులైనా, సన్యాసులైనా - సామాన్యులైనా... ఎవరైనా కానీ వారందరినీ సమదృష్టితోనే చూసేవారు శ్రీరమణులు. అంతేకాకుండా, తమ వద్దకు వచ్చిన వారందరితోనూ ఆత్మానుభవం కలగడం తేలికే అంటారు వారు. శ్రీరమణ ఉపదేశాలు విన్న భక్తులకు, "నిజమే కదా! ఆత్మానుభవం కలగడానికి ఎటువంటి ఆసనాలు వేయవలసిన పనిలేదు. మన భావన యొక్క కేంద్రాన్ని మార్చుకుంటే సరిపోతుంది." అని అర్థమయ్యేలా సూటిగా బోధ చేసేవారని స్వామి రంగనాథానందుల వారు ఎప్పుడు అనేవారు.

శ్రీరమణాశ్రమం చేరిన తర్వాత స్వామి రంగనాథానందుల వారు అక్కడ మూడు రోజులు మాత్రమే గడిపి, మూడవ రోజున రైలులో తిరుగు ప్రయాణం చేస్తానని శ్రీరమణులకు చెప్పారు. కానీ అలా చెప్పారన్న విషయాన్ని స్వామి రంగనాథానందుల వారు మరచిపోయారు. ఇంతలో తిరుగు ప్రయాణం చేయవలసిన రోజు రానే వచ్చింది. సరైన వేళకే శ్రీరమణులు స్వామి రంగనాథానందుల వారి వైపు చూసి, "రంగనాథానందా, మీరు వెళ్ళవలసిన వేళ అయినది. మీరు రైల్వే స్టేషనుకు వెళ్ళడానికి బండిని ఏర్పాటు చేశాము!" అన్నారు. అంతటి మానవతతో నిండిన శ్రీరమణుల మాటలను విని స్వామి రంగనాథానందులవారు పరవశించి పోయారు.

ఇలా వారి చుట్టూ చేరిన భక్తుల మధ్య అతి సాధారణుల్లాగ వ్యవహరించే శ్రీరమణులను చూసిన స్వామి రంగనాథానందుల

వారికి ఆది శంకర భగవత్పాదుల వారు వివేక చూడామణిలో రచించిన శ్లోకం ఒకటి జ్ఞప్తికి వచ్చింది. ఆ శ్లోకము యొక్క తాత్పర్యం ఇది:

కడు నిరుపేద... కానీ అమితానంద భరితుడు. వెనుక ఏ బలగమూ లేదు .... అయినప్పటికీ అనంత శక్తిశాలి. ఇంద్రియ సంబంధమైన ఆసక్తి లేనప్పటికీ ఎప్పుడూ సంతోషభరితులే. అనన్య సామాన్యులైనప్పటికీ అందరూ తనకి సమానులే అని అనుకునేవారు. ఈ శ్లోకంలో వివరించిన ప్రతి లక్షణము శ్రీరమణులకు వర్తిస్తుంది అని స్వామి రంగనాథానందుల వారు అన్నారు. శ్రీమద్ భాగవతంలో శ్రీకృష్ణుని గురించి చెప్పిన ప్రతి మాట శ్రీ భగవానులకి కూడా వర్తిస్తుందనియూ, శ్రీరమణుల గురించి వింటున్న కొద్దీ ఇంకా వినాలనిపిస్తుందనీ, అసలు మహర్షి సన్నిధానాన కూర్చోవడమే ఒక మహాభాగ్యంగా పరిగణించారు స్వామి రంగనాథానందుల వారు.

మనకి తెలియకుండానే మన హృదయాలలో ప్రవేశించి మనల్ని ఊహించలేనంతగా అనుగ్రహించే 'శ్రీరమణులు' అనబడే ఈ ఆధ్యాత్మిక శక్తి స్వరూపానికి వారి అనుగ్రహం చేత అర్హుల మగుదుముగాక'' అని స్వామి రంగనాథానందుల వారు శ్రీరమణులను గురించి వ్రాసుకున్న దివ్యమైన ఈ మాటలకు మంగళాశాసనం పలికారు.

## Grace is Always Flowing

*'Grace is always flowing', oft quoted by Dr KS, has become a mantra for all devotees of Sri Ramana Kendram, Hyderabad. Everything that happens is through His Grace, and Grace is all there is! Not a blade of grass can move without Divine Grace!*

*The year 2023 marks the 25th year when Dr. KS left his mortal coil (11 January 1998) to merge with his beloved Arunachala Ramana. Hard to believe that so many years have rolled by; his memory is ever fresh, and vibrant in the hearts of those he touched. His gentleness, his affectionate smile and his soft words soaked in devotion are deeply embedded in the devotees who remember him with love and gratitude. The guidance he has given to walk on the path shown by Sri Bhagavan is a legacy inherited by the devotees of the Kendram.*

*To commemorate the 25th year, we present a brief life sketch of Dr KS that appeared in Sharanagati (an Ramanashram e-journal) in the Sept and Oct 2012 issues.*
*- Sneha Chowdary.*

## Tracing the Footsteps of Bhagavan: The Life of Dr K Subrahmanian

*Dr. K. Subrahmanian was a teacher, columnist, author and orator. He was a professor at the Central Institute of English and Foreign Languages, Hyderabad and founded the Sri Ramana Kendram, Hyderabad in 1979. He was the Kendram's inspiration and guiding light for two decades, until his death in January 1998.*

Because both his parents were staunch devotees, K. Subrahmanian had the good fortune to come to Bhagavan at the early age of two. His mother met Bhagavan in 1921 at Skandasramam as a girl of ten, and later visited Bhagavan every year. His father, Prof. V. S. Krishnaswami Iyer of Melvayalamoor (30 kms from Tiruvannamalai), worked as a maths teacher in the Municipal High School, and met Bhagavan in 1927. During this first encounter, he asked Bhagavan:

"There are so many *sadhus*. How can one know who is a genuine *siddha*?" Bhagavan replied in clear terms: "In whose mere presence, without any effort, one gets spontaneous peace of mind - that one is the real *siddha*."

Already from this first meeting, Krishnaswami knew that he had found what he was looking for, and began making regular visits to the Ashram. But shortly after the birth of his son, in April 1928, he was posted to Kodaikanal to teach at the Presentation Convent High School, a prestigious academy designed to prepare students for the Cambridge University exams. Now quite some distance from Tiruvannamalai, the family would have to take advantage of the annual winter breaks to come to the Ashram.

In Kodaikanal, among other teaching duties, Krishnaswami tutored the princess of Nabha. The girl's father, Maharaja Ripudaman Singh, had been banished to Kodaikanal in 1927 by the British[1] and was confined to the municipal limits for the rest of his life. While his exile was severely constraining, it did afford him one reward - the

good fortune of learning about the life and teachings of Sri Bhagavan, and of close association with one of Bhagavan's ardent devotees. The Maharaja and his wife were thrilled to be able to discuss Bhagavan with the professor. Having no curtailment on her travel privileges, the Maharani asked Prof. Krishnaswami to take her with him to see Bhagavan on her husband's behalf. The Maharaja sent a typewriter along with them to present to the Ashram. Once in Bhagavan's presence, the Maharani experienced a peace such as she had never before had.

